విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 15, డిసెంబరు 2025

వృథాగా నీరు.. అరికట్టేదెవరు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని కలుగొట్లపల్లె గ్రామంలో మోటారు బోరు నుంచి లీకేజీ ఏర్పడి నీరు వృథా అవుతోంది. ఇదే గ్రామంలో వేసవి కాలంలో తీవ్ర నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. నేడు గ్రామంలో నీటిని సరఫరా చేసే బోరు నుంచి లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బోరు సమీపంలో పెద్ద రంధ్రాలు పడింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జగదుర్తిలో ముమ్మరంగా రీసర్వే

విశాలాంధ్ర - డోన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్వేయర్ విక్రమ్ తెలిపారు. మండలంలోని జగదుర్తి గ్రామ రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా రీసర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా సర్వేయర్ ఎం.విక్రమ్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ ఈ రీ-సర్వే ప్రక్రియకు తప్పకుండా హాజరుకావాలని కోరారు. సోమవారం నాడు వరి మళ్ళు ఉన్న చెరువు ప్రాంతంలో సర్వే బృందం పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు తమ పొలాల వద్ద దగ్గరుండి, భూములను కొలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మహాలక్ష్మి, గ్రామ తలారి శేఖర్, వీఆర్వో శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అలనాటి.. అపూర్వ కలయిక

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1999 - 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అందరూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో అందరూ ఒక చోట చేరారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అందరూ కలిసి అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాడు చేసిన అల్లరి పనులు, ఆటపాటలు గురించి అందరూ ముచ్చటించుకున్నారు. అప్పటి అధ్యాపకులు ఆల్ఫొన్సా సిస్టర్, ఉషారాణి, కుమారి, బాలమ్మ, త్రిజమ్మ, మైఖేల్, ప్రకాశం, భాస్కర్ రెడ్డి తదితరులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, యశ్వంత్ రెడ్డి, శ్రీనివాసులు, నాగ ముత్తయ్య, రామసుబ్బయ్య, విశాల, మాధవి, చంద్రిక, సుబ్బమ్మ తదితరులతోపాటు అప్పటి విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ సమస్యల కోసం పాటు పడతాం

విశాలాంధ్ర - డోన్ రూరల్: పెన్షనర్స్ సమస్యల కోసం పాటు పడతామని పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భాను సింగ్ తెలిపారు. స్థానిక పెన్షనర్స్ భవన్లో భాను సింగ్ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన ప్రతి ఒక్కరికి ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న పలువురికి ఈ సందర్భంగా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, గాలయ్య, నరసింహులు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల అండగా ఉంటా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : దివ్యాంగుల అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి హామీ ఇచ్చారు. రాయలసీమ దివ్యాంగుల పరిరక్షణ సమితి ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమితి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఆయన ఉచిత ట్రైసైకిళ్ళు, వీల్‌చైర్లు, నిత్యావసర సరుకులు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూమా మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా సమాజం తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాయలసీమ దివ్యాంగుల పరిరక్షణ సమితి ప్రతినిధులు బాల సుబ్బయ్య, స్థానిక నాయకులు, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు అండగా ఉంటా..

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: వైసీపీ నాయకులకు అండగా ఉంటానని శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తరామాపురం గ్రామ వైఎస్ఆర్ సీపీ నాయకులు రామచంద్రుడుకి ఆరోగ్యం బాలేనందున శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి యోగక్షేమలు తెలుసుకున్నారు. వీరి వెంట నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, విజయ్ చౌదరి వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-డోన్: ఈనెల 18న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఆర్డీవో కార్యాలయం దగ్గర జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి సుంకయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నక్కి రామన్ భవన్‌లో సీపీఐ పట్టణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని, పది కళాశాలలకు భవనాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పజెప్పాలని చూడడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలు విద్యార్థులు వైద్యానికి విద్యకు వెళ్లే ప్రభుత్వ హాస్పిటల్లో అనుబంధంగా ఉండే కళాశాలలను ప్రైవేటుకు అప్పజెప్పడం వలన పేద వాళ్ల ప్రాణాలతో చెలగాటమాడమే అని వారు ఆరోపించారు. పీపీపీ పద్ధతిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 16 కాలేజీలు మాత్రమే ఉండేవని, గత వైసీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రైవేటీకరణ ఆపకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఐ పార్టీ శత వార్షికోత్సవాలను ఈ నెల 20 నుంచి 26 వరకు ప్రతి శాఖలో జయప్రదం గా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బి.నారాయణ, పట్టణ కార్యదర్శి మోట రాముడు, సహాయ,కార్యదర్శులు ఎన్.కె రామ మోహన్, ఎం.పుల్లయ్య, నాయకులు కె.నాగరాజు, ఎస్.పులిశేఖర్, పార్టీ శాఖ కార్యదర్శులు జి.అబ్బాస్, మద్దయ్య, వెంకటేష్, రామ్మోహన్, అక్బర్ జులేఖ, ప్రమీల, వనం లక్ష్మి, ఖాదర్, షంషేర్, సుంకన్న, కోన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమంచుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమంచుకోవాలనీ, జీవో నెంబర్ 590, 107, 108లను రద్దు చేయాలని, డిసెంబర్ 18న డోన్, ఆత్మకూరు డివిజన్ కేంద్రాలతో పాటు నంద్యాల మెడికల్ కాలేజీ వద్ద జరుగు ఆందోళనను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పిలుపు నిచ్చారు. నంద్యాల సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, జిల్లా సమితి సభ్యులు రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొత్తగా 17 వైద్య కళాశాలలో వైద్య సీట్ల సంఖ్య పెరుగుతుందని, వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశించడం జరిగిందని, కానీ గత ప్రభుత్వం జీవో నెంబర్ 107, 108 తీసుకువచ్చి సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా ఆయా మెడికల్ కాలేజీలలో సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించడంతో వాటిని వ్యతిరేకిస్తూ వామపక్ష, విద్యార్థి ప్రజా సంఘాలు తీవ్రంగా ఉద్యమించాయని, యజమాన్య కోటా సీటును 12 లక్షలు, ఎన్నారై కోటా సీటును రూ.20 లక్షలు వసూలు చేస్తారంటూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు తీవ్రంగా విమర్శించాయని, కానీ అధికారం చేపట్టిన ఇదే కూటమి పార్టీలు ఆ జీవోలను రద్దు చేయకపోగా వైద్య విద్యను పిపిపి విధానంలో పూర్తిగా ప్రైవేటుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గచర్య అన్నారు.

రివిట్‌మెంట్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-అవుకు: జలాశయం రివిట్మెంట్ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారము రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎస్ఆర్‌బీసీఎస్ ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకులు ఐవి పక్కీరా రెడ్డి, చల్లా విజయభాస్కర్ రెడ్డి, మోట్ల రామిరెడ్డి, బనగానపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మారం పుల్లారెడ్డిలతో కలిసి జలాశయం వద్ద జరుగు తున్న రివిట్మెంట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరము ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్లనే అవుకు జలాశయంను పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రివిట్మెంట్ కుంగిన ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ చేసే పనులను ప్రారంభించడం జరిగిందని ఈనెల చివరికల్లా పనులు పూర్తిచేసి నీటి లీకేజీలను అరికడతామన్నారు. ప్రస్తుతము ఉన్న నిధులు నిర్మాణ పనులకు సరిపోని ఎడల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు చెప్పి అవసరమైన మేరకు నిధులు తెస్తానని అన్నారు. నాణ్యత భద్రతా విష యంలో ఎక్కడ రాజీ పడవద్దని ఇరిగేషన్ అధికా రులను ఆదేశించారు. భవిష్యత్తులో రిజర్వాయర్కు ఎలాంటి సమస్యలు రాకుండా పటిష్టమైన పనులు నిర్వహించాలని అన్నారు. రిజర్వాయర్ లీకేజీలపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. నాటి చిన్న లీకేజీలను పట్టించుకోకపోవడం వలన ఈ సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతానికి రిజర్వాయర్ ట్రీట్మెంట్ పనుల నిర్మాణానికి కోటి రూపాయల వరకు నిధులు విడుదల చేశామని అన్నారు. రిజర్వాయర్ లీకేజీల, సమస్య భద్రతా విషయంలో ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనకాడదన్నారు.

బోటింగ్‌ను పునఃప్రారంభిస్తాం : అవుకు జలాశయం రివిట్మెంట్ పనుల పరిశీలన నిమిత్తం వచ్చిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా జలాశయంలో బోటింగును త్వరలోనే పునఃప్రారంభిస్తామని అన్నారు. జలాశయంలో బోటు ప్రమాదం వలన నలుగురు చనిపోవడం జరిగిందని అన్నారు. పర్యాటక శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే బోటింగ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు. ఎస్ఆర్‌బిసి ఈఈ శుభ కుమార్, డిఈ సాయి కృష్ణ, జేఈ సుధాకర్, సంఘ పట్నం వీరారెడ్డి, ఆకుల నాగిరెడ్డి, ఇస్మాయిల్ ఖాన్, మద్దిలేటి గౌడ్, తిక్కన్న, దంతల రమణ, వెంకటేష్, జయ శివుడు, రామాపురం నాయుడు, తెలుగుదేశం కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..

విశాలాంధ్ర - చాగలమర్రి: గ్రామాల్లో పొలం పనులకు వెళ్లే మహిళలు సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ట్రాక్టర్లు, ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. మండలంలోని గొట్లూరు సమీపంలో పొలం పనులకు వెళ్లే మహిళా కూలీలు ట్రాక్టరుపై ప్రమాదకరంగా ప్రయాణించారు. ఇద్దరు మహిళలు ట్రాక్టరు ముందుభాగంలో కూర్చొని ప్రయాణించారు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాలు పోయే ప్రమాదముంది.

ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతు లను సాధ్య మైనంత త్వరగా పరిష్కరిం చాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం నాడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు.

హిందువులంతా ఐకమత్యంతో మెలగాలి



విశాలాంధ్ర - డోన్ రూరల్: హిందువులంతా ఐకమత్యంతో కలిసి ఉండాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రాంత ప్రచార ప్రముకు బయ్యా వాసు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ సుధా హై స్కూల్ ప్రాంగణంలో జరిగిన విశ్వహిందూ పరిషత్ సమా వేశంలో వాసు మాట్లాడుతూ శ్రీరాముని జీవితం హిందువులందరికీ ఆచరణ యోగ్యమని తెలిపారు. ఆధునిక పోకడలు పోతున్న సమాజంలో కుటుంబ వ్యవస్థ చిన్న బిన్న మవుతున్నాయని వాటిని సన్మార్గంలో ప్రతి ఒక్క హిందువు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సుధా విద్యాసంస్థల డైరెక్టర్ సుదర్శన్, స్వామిజి రఘునందన్ ప్రభు, వీ రు నంద స్వామి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, పాతాళం సుబ్బారావు, ప్రవచన కర్త అనురాధ, సందు రమణ, హేమ సుందర్ రెడ్డి, కమలేష్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతివేగం అజాగ్రత్తతో మృత్యు మీ ముందే అనే నినాదంతో రూపొందించిన పోస్టర్లను బిసి రాజారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో వాహనదారులు, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తన సొంత డబ్బులతో అతివేగం అజాగ్రత్తతో మృత్యువు మీ ముందే అనే నినాదంతో పోస్టర్లను ముద్రించి విస్తృతంగా ప్రచారం చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించి ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రచారం మొదలు పెట్టామన్నారు. అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్, యూనియన్ నాయకులు వలి, శ్రీనివాసులు అమీర్జాన్, చౌడయ్య పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో బలిజ సోదరుల ఆత్మీయ సమ్మేళనం చేపట్టిన నాయకులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలో బలిజ సోదరుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు నల్లగట్ల బాలుడు, మైలేరి మల్లయ్య, అర్జిగారి నరసింహులు పాల్గొని మాట్లాడారు. పుట్టగ శ్రీకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ వారి అభినవ కృష్ణదేవరాయ పవన్ కళ్యాణ్ బిరుదు ప్రదాన కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇది సేవకు, త్యాగానికి, ప్రజాప్రయోజన నాయకత్వానికి లభించిన మహా గుర్తింపు అని అన్నారు. ఆళ్ళగడ్డలో శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం దగ్గర అభినవ కృష్ణదేవరాయ బిరుదు ప్రదానం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. నియోజకవర్గ బలిజ నాయకులు కొల్లం పుల్లయ్య, ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, జిల్లా సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు మున్సిపల్ అధికారుల చర్యలు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలో ఇటీవల కాలంలో చిన్నారిపై వీధి కుక్క దాడి చేయడం జరిగింది. దీంతో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గత రెండు రోజుల క్రితం ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి ఘటనపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తక్షణం స్పందించిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు అధికారులు ఆదివారం వివిధ కాలనీల్లో భారీగా వీధి కుక్కలను బంధించి తీసుకెళ్లారు. దీనితో ఆయా కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - రుద్రవరం: ప్రతి సోమవారం మండల కేంద్రంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు ఆల్ఫ్రెడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించబడుతుందన్నారు. ప్రతి ఫిర్యాదుకు రసీదులు అందజేస్తామని తెలిపారు. ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న ప్రతి దరఖాస్తుకు సత్వర పరిష్కారం చేయడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లడం అవసరం లేదని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

రైతులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గొట్లూరు గ్రామంలో దాదాపు 150 ఎకరాల్లో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛానల్ తెగిపోవడం వల్ల పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నాయకులు బాస్కర్, బాలనరసింహుడులు డిమాండ్ చేసారు. ఆదివారం మండలంలోని గొట్లూరు గ్రామంలో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ ద్వారా అధిక నీటి ఉధృతితో దెబ్బతిన్న 150 ఎకరాల శనగ పంటను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటరీ ఛానల్ తెగి శనగ పంట మీద నీరు పారడం వల్ల పంట మునిగిపోయి పూర్తిగా నష్టం వాటిల్లిందని, పంట పూర్తిగా పాడై, దిగుబడి వచ్చే అవకాశమే లేకుండా పోయిందన్నారు. కాబట్టి ప్రభుత్వం వారు తక్షణ సాయం కింద రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ క్రాప్ ద్వారానైనా రైతులకు పంటల బీమా వర్తింపజేసి, న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా నేలంపాడు నుంచి గొట్లూరు వెళ్లే మార్గంలో దాదాపు సుమారు వెయ్యి ఎకరాల వరకు నీట మునిగిపోయి అధిక వర్షాల వల్ల కాలువల నుంచి నీరు వచ్చే దానివల్ల రైతులు పైరు వేసుకోవడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. గత 15 ఏళ్లుగా ఇదే పరిస్తితి ఉందని నీరు వెళ్ళే దానికి సబ్ చానల్ రోడ్డు వెంట గతంలో ఉన్న బ్రిడ్జిల నిర్మాణం చేపట్టి రైతులు పొలాలు సాగు చేసుకునేందుకు వీలుగా కాలువలు, బ్రిడ్జిలు ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టేలా పోరాడాలని రైతు సంఘం నాయకులను రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు రోసిరెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరమార్శించిన బీసీ ఇందిరారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలోని ఈద్గానగర్‌కు చెందిన మహమ్మద్ ఖాసీం గుండె ఆపరేషన్ చేయించు కోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి మహమ్మద్ కాశీం నివాసానికి వెళ్లి పరామర్శించి, వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

పచ్చని పంటల్లో పవర్ గ్రిడ్ చిచ్చు

- పచ్చని పంటల్లో పవర్ గ్రిడ్ చిచ్చు
- దౌర్జన్యంగా టవర్ల నిర్మాణం
- రైతుల అభిప్రాయాలు తీసుకోకుండానే పనులు
- కలెక్టర్ అనుమతి ఇచ్చారంటూ బుకాయింపు
- నష్టపరిహారంపై లభించని హామీ
- ఆవేదన చెందుతున్న రైతులు



విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: పచ్చని పంట పొలాలను నాశనం చేస్తూ చేపట్టిన పవర్ గ్రిడ్ విద్యుత్ టవర్లు, లైన్ ఏర్పాట్లపై రైతన్నలు భగ్గు మంటున్నారు. గ్రామసభలు నిర్వహించకుండా రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా పవర్ గ్రిడ్ అధికారులు, కాంట్రాక్టర్లు నియంతలుగా వ్యవహరిస్తుండడంతో అన్నదాతలు మండిపడు తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి విధానాలను, నిబంధనలను, చట్టాలను చూడలేదని ఆవేదన చెందుతున్నారు. కనీసం బాధిత రైతుల అభిప్రాయలు తెలుసుకోకుండా అధికారులు కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా తమ పచ్చని పంట పొలాలను ధ్వంసం చేస్తు విద్యుత్ టవర్ల నిర్మాణం చేపట్టడంతో ఆవేదన చెందుతున్నారు. గ్రామసభలు నిర్వహించకుండా, నోటీసులు ఇవ్వకుండా రైతుల అభిప్రాయాలు తెలుసు కోకుండా కాంట్రాక్టర్లు అధికారులే నిర్ణయాలు తీసుకుని వారే నష్టపరిహారం నిర్ణయించడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. టవర్లు పడే పొలాల రైతులను విభజించు పాలించు అన్న విధంగా వ్యవహరిస్తూ ఫోన్లలో సంప్రదిస్తూ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామ సభలు నిర్వహించే అధికారం తమకు లేదని, కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారని, మీ పొలాలలో విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెపుతూ తప్పించుకుంటున్నారు. గ్రామ సభలు నిర్వహించి, రైతుల అభిప్రాయం తెలుసుకుని వారిని ఒప్పించి, విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం పైనే అందరికీ అనుమానాలు తలెత్తుతున్నాయి. మండలంలోని చింతలాయిపల్లి, మదనంతపురం, బందార్లపల్లి, అబ్దుల్లాపురం గ్రామాల పరిధిలో పవర్ గ్రిడ్ విద్యుత్ టవర్ల ఏర్పాటుపై రైతులు మండిపడుతున్నారు. ముందే నష్టపరిహారం చెప్పకుండా విద్యుత్ టవర్ల ఏర్పాటు చేస్తున్నా దంపై ఆందోళన వ్యక్తం అవుతున్నది. స్థానిక నాయకులు రైతుల అభిప్రాయములను ఏ మాత్రం పట్టించుకోకపోవడం పైనే రైతుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. ఒక్కో విద్యుత్ టవర్ వలన పొలంలో పది నుండి 20 సెంట్లు వరకు శాశ్వతంగా పంట దిగుబడి కోల్పోయే అవకాశం ఉన్నదని, ఈ నష్టాన్ని ఎవరు చెల్లిస్తారు అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. లైన్ కింద బోరు బావులు తవ్వించాలన్న ఇబ్బందులు తలెత్తుతాయని వాటికి పరిష్కారం ఏమిటంటు రైతులు అడుగుతున్నారు. ఏదేమైనా మండల పరిధిలో విద్యుత్ టవర్ల ఏర్పాటు వివాదం రోజురోజుకు పెరుగుతున్నది. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయకుంటే శాశ్వతంగా అన్యాయం అయిపోతారు.

హైందవ ధర్మరక్షణకు పాటుపడదాం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: కులాలకు అతీతంగా హిందువులంతా ఐక్యంగా ఉండి హైందవ ధర్మ రక్షణ, అభివృద్ధికి పాటుపడాలని పీఠాధిపతులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి కమ్యూనిటీ హాల్ వరకు భక్తి పాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని రామ సుబ్రహ్మణ్యం రాజా కమ్యూనిటీ హాలు నందు ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా పీఠాధిపతులు హిందూ ధర్మకర్తల ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన సభను ఘనంగా నిర్వహించారు. హిందూ నాయకులు శ్రీనివాసులు చంద్రశేఖర్ రెడ్డి, జయరాముడు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళన సభలో ముఖ్య అతిథులుగా నెరవడ శ్రీ రాధాకృష్ణ మఠం పీఠాధిపతులు పాండురంగ నంద భారతీ స్వామి, మాతాజీ రుక్మిణి భారతి, అనంత భారతి స్వామి, గౌరవ అతిథిగా బాల వికాస్ సహ సంయోజక్ సాయి సృజన, శ్రీశైలం శివాజీ స్ఫూర్తి కేంద్రం ప్రచార చింత మోహన్, ఆధ్యాత్మిక వేత్త వివిఎస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులంతా ఐక్యంగా కలిసి ఉన్నప్పుడే నిలబెడతామని లేదంటే పడిపోతామన్నారు. హైందవ ధర్మాలు సాంప్రదాయాలు సంస్కృతిని కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలన్నారు. సమ్మేళనానికి మండల టిడిపి అధ్యక్షులు మూలే రామేశ్వర్ రెడ్డి, రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు మాజీ సమితి ప్రెసిడెంట్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత్ కుటుంబం సమాజానికి ఆదర్శం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన యువకుడు ప్రశాంత్ పార్థివ దేహానికి ఆత్మకూరు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాము నివాళులర్పించారు. సీఐ చేసిన వ్యాఖ్యలు, యువకుడి తల్లి దండ్రులు తీసుకున్న అవయవదాన నిర్ణయంపై ఆయన చూపిన గౌర వం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాములపాడు మండలం, భాను ము క్కుల టర్నింగ్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రశాంత్ తలకు తీవ్ర గాయా లై, చికిత్స ఫలించక మృతి చెందాడు. ఈ దురదృష్టకర సంఘ టనపై సీఐ రాము తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పార్థీవ దేహానికి నివా ళులర్పించిన అనంతరం సీఐ రాము మాట్లాడుతూ ఉద్వేగానికి లోనయ్యా రు. ప్రశాంత్ మృతి కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : మండలంలోని అమడాల గ్రామంలో కుటుంబ సమస్యల కారణంగా మద్దిలేటి (85) క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 15, డిసెంబరు 2025

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - కోడుమూరు: కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలోని పంటపొలాలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, అలాగే జిల్లాలో పెండింగ్‌లో నున్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు.ఆదివారం స్థానిక సీపీఐ భవన్‌లో నియోజకవర్గ పరిధిలోని గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల సీపీఐ పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి బి.రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నక్కి లెనిన్ బాబు మాట్లాడుతూ డిసెంబర్ 25న జరిగే సీపీఐ పార్టీ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం,నూతన పరిశ్రమలు స్థాపించడం, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం అవసరమన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, మహిళల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రజా సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రాజధాని నిర్మాణం,పోలవరం ప్రాజెక్టులపై చూపుతున్న శ్రద్ధ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మాధవస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి శేష్ కుమార్, సహాయ కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు, సీపీఐ సీనియర్ నాయకులు భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, అల్తాఫ్, గూడూరు ఏఐటీయూసీ అధ్యక్షుడు రాజు,సీపీఐ నాయకులు శేషు, దుబ్బన్న పాల్గొన్నారు.

కర్నూలు అభివృద్ధి కోసమే కష్టపడుతున్నా : మంత్రి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కర్నూలు అభివృద్ధి కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఆదివారం నగరంలోని మౌర్య ఇన్‌లో కర్నూలు నియోజకవర్గ టీడీపీ క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని నూతన కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. పార్టీ క్యాడర్ మొత్తం నిరంతరం కష్టపడి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల్లో మంచి పేరున్న నాయకులకు అవకాశాలు వాటంతటఅవే వస్తాయన్నారు. రాబోయే ఎన్నికల్లో సర్వేలు చేసే టికెట్లు కేటాయిస్తామన్నారు. గతంలో తనకు కూడా ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే విషయంలో సర్వేలు చేసి ప్రజల్లో మంచి పేరు ఉన్నందుకే టికెట్ ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని, మంత్రిగా సీఎం చంద్రబాబు నాయుడు అవకాశం ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నమ్మకానికి తగ్గట్టుగా కష్టపడుతున్నట్లు టీజీ భరత్ చెప్పారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే ప్రతి వార్డులో ప్రధానమైన 3 సమస్యలు గుర్తించి ముందుగా వాటిని పరిష్కరించే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. గూడెం కొట్టాల వాసులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు పట్టాలిచ్చినట్లు మంత్రి టీజీ భరత్ గుర్తు చేశారు. ఏ,బీ,సీ క్యాంపు క్వార్టర్లలో కూడా అభివృద్ధి చేసేందుకే తాను ఆలోచన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్కడ హైకోర్టు బెంచ్, కలెక్టరేట్ కార్యాలయం నిర్మిస్తామన్నారు. అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక అనవసరంగా తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. తప్పుడు వార్తలు రాసే వారిపై న్యాయపరంగా ముందుకు వెళతామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రతి ఒక్కరూ ప్రజలకు చేరవేయాలని క్యాడర్‌కు చెప్పారు. సోషల్ మీడియాను వాడుకోవాలని ఆయన కోరారు. అనంతపురం నుండి కర్నూలు వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌లా డెవలప్ చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు భారీగా వస్తాయన్నారు. తమ ప్రభుత్వం ఇలాగే కొనసాగితే రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే టాప్‌లో ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసం తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ నాయకుడు అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కావాలని అడుగుతున్నారని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలన్నారు. ప్రజలు సరైన తీర్పు ఇచ్చినప్పటికీ వారి వైఖరి మారడంలేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్, కార్పొరేషన్ల డైరెక్టర్లు జగదీష్ గుప్త, సంతోష్, సంజీవ లక్ష్మి, కాణిపాకం ఆలయ బోర్డు మెంబర్ రాజ్యలక్ష్మి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ శేషగిరి శెట్టి, మార్కెట్ యార్డు డైరెక్టర్ మారుతీశర్మ, కార్పొరేటర్లు జకియా అక్సారీ, పరమేష్, విజయ కుమారి, ఫరాజ్ ఖాన్, పద్మలతా రెడ్డి, ఖాదర్ బాష, క్రాంతి, తెలుగుయువత పార్లమెంట్ అధ్యక్షుడు అబ్బాస్, నాయకులు హమీద్ బాష, సుంకన్న, శేషు యాదవ్, రామాంజనేయులు, ఉట్ల రమేష్ బాబు, మోహన్, తిమ్మా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సురేంద్ర, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో స్విమ్మింగ్ క్రీడాకారులను అభినందించిన ఎంపీ

విశాలాంధ్ర - ఓర్వకల్లు: న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటున్న కర్నూలు ఈత క్రీడాకారులను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అభినందించారు. అండర్ 19 విభాగంలో పాల్గొంటున్న ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వి.హేమలత అండర్ 17 విభాగంలో పాల్గొంటున్న కె.శృతి, సిరి చేతన రాజ్, పి.లహరిలను ఢిల్లీలో ఎంపీ అభినందించారు. ఆయన పాల్గొంటున్న ఈవెంట్ల గురించి వారి తల్లిదండ్రులు దస్తగిరి, రామక్రిష్ణ, శివరాజ్ వెంకటేశ్వర్లులను అడిగి తెలుసుకున్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

రాత్రి బస కార్యక్రమంలో పోలీసులు

విశాలాంధ్ర - సి.బెళగల్: గ్రామాల్లో రాత్రి బస కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాలతో గ్రామాల్లో పల్లెనిద్ర నిర్వహిస్తున్నటు ఎస్సై వేణుగోపాల్ రాజు తెలిపారు. పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి బసకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీయడం జరిగిందన్నారు. పోలీసు అధికారులు, గ్రామాలలోని ప్రజలు యువత, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు హర్షనీయం

విశాలాంధ్ర - ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో అమీలియో హాస్పిటల్స్ ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు హర్షనీయమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాలతో ఉచిత వైద్య వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు మాట్లాడుతూ డాక్టర్లు దైవంతో సమానమని, ప్రజలు ఎక్కడ ఇబ్బందులలో ఉన్న అక్కడికేవెళ్లి పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందిస్తారనీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ మైనారిటీ ఉపాధ్యక్షులు ఖాజామియ్య, పాణ్యం టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు తలారి విజేయుడు, గ్రామ టీడీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, క్రిష్టారెడ్డి, సుబ్బరెడ్డి, శ్రీపతి, మైనారిటీ నాయకులు హుసేన్, సర్కార్ ఎల్ఐసీ మద్దయ్య, డిష్ జయమద్దిలేటి, పట్టెల మోహన్, తిమ్మారెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో పీజీఆర్ఎస్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.

మాజీ సర్పంచ్ గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: చిట్యాల మాజీ సర్పంచ్ గుండాలయ్య గౌడ్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు చిట్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుండా లయ్య గౌడ్ టీడీపీ బలోపేతానికి ఎనలేని కృషి చేశాడని వారు తెలిపారు. అనేక సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాలకు వెళ్లి చురుకుగా పాల్గొని పనిచేశారన్నారు. చిట్యాల గ్రామ అభివృద్ధికి ఎంతో సహకారంగా పనిచేశాడన్నారు. కేఈ కుటుంబానికి ముఖ్య అనుచరుడుగా ఉంటూ, వారి అడుగుజాడల్లో చివరి వరకు నడిచారన్నారు. మాజీ సర్పంచ్ మృతి టీడీపీకి తీరనిలోటని, మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు తెలిపారు. గుండాలయ్య గౌడ్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు అభిమానులు తెలిపారు.

ఉపాధి హామీ చట్టంను నీరుగార్చే కుట్రను మానుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధి హామీ చట్టంను నీరు కార్చే కుట్రను మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నబి రసూల్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కారన్నలు డిమాండు చేశారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలను కల్పించి రోజుకి కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

నగర హెూటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ మూడో మహాసభ కరపత్రాలు విడుదల

విశాలాంధ్ర - కర్నూలు : కర్నూలు నగర హెూటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మూడో మహాసభ కరపత్రాలు నేడు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి. ఎస్.మునెప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు జి.చంద్రశేఖర్, బి.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణారెడ్డి హెూటల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం, టి.రామాంజనేయులు మరియు సభ్యులు కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ జిల్లాలో హెూటల్లు, రెస్టారెంట్లు, దాబాలు, బేకరీలలో వంట మాస్టర్లుగా సప్లయర్స్‌గా క్లీనర్స్‌గా అనేక కార్మికులు పని చేసుకుంటూ జీవనం చేస్తున్నారు వీరు దాదాపు ఉదయం 5 గంటలు మొదలుకొని, రాత్రి 11 గంటల వరకు, అవసరమైతే అర్థరాత్రి 12 గంటల వరకు పనిచేస్తూ ఉంటారు. అయినప్పటికీ కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు, ఇంటి అద్దెలకు చాలీ, చాలని జీతాలతో సతమతమవుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. వీరు యజమానుల దగ్గరుండి అడ్వాన్స్ రూపేనా ముందస్తుగా అప్పులు తీసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి జ్వరం వచ్చిన, జబ్బు వచ్చినా పనికి పోతే డబ్బులు లేకపోతే కుటుంబమంతా పస్తులు ఉండే పరిస్థితి. కార్మికులు పని ప్రదేశాలలో పనిచేసేటప్పుడు ఏదైనా ప్రమాదం గ్యాస్, వేడి నూనె, వేడిపదార్థాల వల్ల, కరెంటు వల్ల ప్రమాదం సంభవించినప్పుడు యజమాని దయ దక్షిణాలపై ఆధారపడి వలసి వస్తుంది. ప్రభుత్వము నుండి ఎటువంటి సాయం అందలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. హెూటల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రమాద బీమా ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులుల, సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనాలు అమలు చెయ్యాలని అనేక డిమాండ్లతో, ఎస్ టీ యూ భవనంలో జనవరి 7న జరిగే 3వ మహాసభలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని అజెండా ఏర్పాటు చేసుకుంటామని, ఈ మహాసభను కార్మికులంతా కృషిచేసి విజయవంతం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నల్లన, హెూటల్ అండ్ బేకరీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు నాగేంద్ర, నరసింహ, అయ్యన్న మద్దిలేటి, రఘు, ధనుంజయ, సమీర్, ఇమ్రాన్, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



విశాలాంధ్ర - కోడుమూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కోడు మూరు పట్టణ కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో కొళాయిల రాముడు అధ్యక్షతన నిర్వహించిన పట్టణ స్థాయి సమావేశానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీ రసూల్, సీపీఐ మండల కార్యదర్శి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్‌లు ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కాటేన్నగారి నాగరాజు, ఉపాధ్యక్షులుగా బి.విశ్వనాథ్, ఈశ్వరయ్య ఆచారి, కార్యదర్శిగా జి.రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా జి.వెంకటస్వామి, బి.నగేష్, కోశాధికారిగా ఏడుకొండలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు, కమిటీ సభ్యులుగా మొత్తం 12 మందితో కూడిన పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర - దేవనకొండ : మండలం పరిధిలోని భైరవాణికుంట గ్రామానికి చెందిన గొల్ల లింగమూర్తి (39) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీలకు తెలిపిన వివరాల మేరకు.. గొల్ల లింగమూర్తి ఈ నెల 9న పొలం ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు పత్తికొండకు వెళ్లారు. పాత కక్షలు మనుస్సులో పెట్టుకుని ఇదే మండలంలోని నేలతలమారి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కాపుకాసి, ఉద్దేశ్య పూర్వకంగా పత్తికొండ సబ్ జైల్ సమీపంలోని మద్దిగేరిలో అదే రోజు మారుణ ఆయుధాలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో లింగమూర్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు గాయాలైన లింగమూర్తిని వైద్యం కోసం కర్నూలు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక లింగమూర్తి ఈ నెల 14న ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ టౌర్నమెంట్‌ను ప్రారంభించిన ఎర్రకోట రాజీవ్ రెడ్డి

విశాలాంధ్ర - నందవరం: క్రిస్టిమస్, నూతన సంవత్సరం సందర్భంగా ఇబ్రహీంపురం గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మిగనూరు వైసీపీ ఇంచార్జీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ప్రారంభించారు. ఆదివారం పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ క్రీడలు యువత జీవితంలో క్రమశిక్షణ, సహనం, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయికి ఎదిగే క్రీడాకారులు రావాలనే లక్ష్యంతో ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో అవసరమన్నారు. యువత శారీరకంగా దృఢంగా, మానసికంగా బలంగా ఎదగాలంటే క్రీడలకు ప్రోత్సహము అవసరమన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మి గెడ్డం నారాయణ రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, విద్యార్థి విభాగ కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి, మండల కార్యదర్శి బి.వెంకటేష్, సర్పంచ్ నాగేష్, సకరప్ప, గోవిందు, శివారెడ్డి, ఓంకార్, బండేష్, శాంతిరాజు, నరసింహులు, సీనప్ప ఆచారి, దాసరి బీమా, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రానిస్తున్న రోటరీ క్లబ్ క్రీడా పోటీలు

విశాలాంధ్ర - ఆదోని :విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని నిర్వహించే రోటరీ క్లబ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల స్ఫూర్తితో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని కాబోయే రోటరీ డిస్టిక్ గవర్నర్ త్రివిక్రమ్ జోషి 2027 అన్నారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ ఆక్టివిటీస్ 2025- 26 యాన్యువల్ జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి రోటరీ క్లబ్ అప్ కమింగ్ డిస్టిక్ గవర్నర్ త్రివిక్రమ్ జోషి, డిఇఓ రాజేంద్రప్రసాద్, లెక్చరర్ కళ్యాణ్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్ల, సెక్రటరీ మేఘనాథ్ రెడ్డి, యూత్ ఆఫీసర్ సాబీర్, వికాస్ లు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడా పోటీలు ప్రారంభానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్ల, సెక్రటరీ మేఘనాథ్ రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు కాగడ ను చేత పట్టుకుని గ్రౌండ్లో తిరిగి ఆటల పోటీలను ప్రారంభించారు. ఆటల పోటీల్లో 60 స్కూళ్ల నుండి దాదాపు 3500 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలుగు తీసేందుకు క్రీడ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఫుట్బాల్, త్రో బాల్, కబడ్డీ, డాడ్జ్ బాల్, బాస్కెట్బాల్, అథ్లెటిక్స్, కోకో, టెన్నికాయిట్ ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కప్పులతోపాటు సర్టిఫికెట్ అందజేశారు. క్రీడా పోటీలు సజావుగా సాగేందుకు 60 మంది వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం యనలేనిదని, పీఈటీలను ఘనంగా సన్మానించారు. క్రీడా పోటీలు పాల్గొనందుకు వచ్చిన విద్యార్థి విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుడు సునీల్ రెడ్డి అధ్యక్షతన భోజన వసతిని కల్పించారు. రోటరీ క్లబ్ సభ్యులు ట్రెజరర్ షణ్ముఖ, సభ్యులు శ్రీధర్ రెడ్డి, జీవన్ సింగ్, అన్న విట్టా మురళీధర్, సోమశేఖర్ రెడ్డి, భరత్ షా, ప్రశాంత్ గాంధీ, సుబ్బయ్య, వీరేష్ స్వామి, పద్మనాభయ్య శెట్టి, సందీప్ రెడ్డి, శేషయ్య, శివరాం, హుస్సేన్ బాష, వినయ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ నగర సాకారానికి కీలక అడుగులు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలును స్వచ్ఛ నగరంగా సాకారం చేయాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ కీలక చర్యలు చేపడుతోందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగర పరిధిలోని ఖాళీ స్థలాల్లో విస్తరించిన పిచ్చి మొక్కల తొలగింపునకు 27 జెసిబిలతో స్పెషల్ డ్రైవ్‌ను కమిషనర్ ప్రారంభించారు. నగరంలోని ఐదు రహదారుల కూడలి సమీపంలోని పాత ఎస్పీ బంగ్లా వద్ద జెండా ఊపి ఈ స్పెషల్ డ్రైవ్‌కు కమిషనర్ శ్రీకారం చుట్టారు. అనంతరం బుధవారపేట స్మశాన వాటిక పక్కన, కొత్తపేట ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో విపరీతంగా ఉన్న పిచ్చి మొక్కల తొలగింపును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల వల్ల పాములు, తేళ్లు, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతున్నాయని, పందులు ఆవాసంగా మార్చుకుని పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. నగర శుభ్రత, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తప్పనిసరిగా అమలు చేస్తున్నామని తెలిపారు. విస్తరిత ప్రాంతాల్లో ఖాళీ స్థలాల సమస్య అధికంగా ఉండటంతో ఆయా డివిజన్లకు అవసరమైన మేర జెసిబిలను కేటాయించి, ఒకేసారి శుభ్రత పనులు చేపట్టినట్లు తెలిపారు.రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరిల చొరవతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి 27 జెసిబిలను అందించడం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ నగర లక్ష్యం సాధ్యమవుతుందని, శుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి నగరపాలక సంస్థకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఖాళీ స్థలాల యజమానులు స్వచ్ఛందంగా శుభ్రత పాటించకపోతే నగరపాలక సంస్థ చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తుందని, జరిమానా చెల్లించిన తర్వాతనే సంబంధిత భవన నిర్మాణ అనుమతులు, వీఎల్‌టీ, ఆస్తి పన్ను ప్రక్రియలు చేపడతామని కమిషనర్ స్పష్టం చేశారు. అప్పటివరకు ఆ స్థలాలను కార్పొరేషన్ కార్యకలాపాలకు వినియోగించుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి అండగా ఉంటాం

విశాలాంధ్ర - నందవరం: క్రీడలు అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి, అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డిలు అన్నారు. ఆదివారం క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా పూలచింత గ్రామంలో సర్పంచ్ బండే గురు స్వామి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ యువతకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడారంగంలో యువత రాణించి దేశ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. మహిళ ప్రపంచకప్ గెలిచి మన జట్టు ప్రపంచ విజేతగా నిలిచిందని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విజేతకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గజేంద్ర రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నది కైరవాడి వీరారెడ్డి, లచ్చప్ప, గడ్డంబజారి, నాగలదీన్నే తిమ్మప్ప, నాగలదిన్నె మునఫ్, మాచాపురం సుధాకర్ రెడ్డి, పెద్దకొత్తిలి రంగన్న, జోహారాపురం నాగేంద్రప్ప, పూలచింత షరీఫ్, బంగారి, రాజు, గంగవరం శాంతిరాజు, సజీపురం హేజ్ ఖేల్, ముగతి బాలరాజు, నరసింహులు, మల్లికార్జున, చాకలి వెంకటేష్, తెలుగు ఈరన్న, మోహన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ధన దాహం

- రెవెన్యూ శాఖలో కాసుల వర్షం కురిపిస్తున్న భూ రీ సర్వే
- సెంటుకు వెయ్యి రూపాయలు ఇవ్వాలంటున్నా సర్వేయర్లు
- వీఆర్వోల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్న సర్వేయర్లు
- బయటికి చెపితే ఆన్‌లైన్ ఆగుతుందని భయపడుతున్న రైతన్నలు

విశాలాంధ్ర - నందవరం : ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఒక్క రూపాయ ఖర్చు లేకుండా రైతులందరికీ ఉచితంగా భూ రీసర్వే చేయించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేస్తే, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం ఆ మాటని పక్కన పెట్టి అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందవరం మండలంలో గత వైసీపీ హయంలో 13 గ్రామాలు, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నది కైరవాడి, ముగతి గ్రామాలు పూర్తి కాగా, ప్రస్తుతం టి.సోమాలగూడూరు గ్రామంలో భూ రీసర్వే జరుగుతుంది. ఇంకా నందవరం, కనకవీడు, హాలహర్వి గ్రామాల్లో భూ రీ సర్వే జరగాల్సింది ఉంది. పూర్వికుల కాలంలో ఉన్న భూములు, నేడు భూ రీ సర్వేలో చాలా చోట్ల రైతుల రికార్డులో కన్నా ఎక్కువ భూమి సర్వేలో బయటకు రావడం జరుగుతుంది. అదే అదునుగా భావించిన సర్వేయర్లు ఒక్కో సెంటుకు వెయ్యి రూపాయలు కచ్చితంగా ఇవ్వాలని, లేకపోతే మీ ఫైల్‌పై మా తహసీల్దార్ సంతకం చేయదని మీ ఇష్టం ఉంటే చేయించుకోండి లేకపోతే ఆన్‌లైన్ చేయమని బహిరంగంగానే వీఆర్ఓలతో చెప్పిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ సమస్యలు ఉన్న పొలాలపై సర్వేయర్లు రైతులకు జాయింట్ ఎల్పీ నెంబర్లు కేటాయించడంతో బ్యాంకులకు వెళ్ళితే లోన్లు ఇవ్వడం లేదని, ఎల్పి నెంబర్ వేరు చేయడానికి రూ.3వేల నుండి రూ.5వేల వరకు సర్వేయర్ వసూళ్లు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కొంతమంది రైతులను విచారించగా, మేము డబ్బులు ఇచ్చిన మాట వాస్తవమని, కానీ ఒకవేళ మా పేరు బయటకు వస్తే మా భూమిని ఆన్‌లైన్లఓ తొలగిస్తారని లేదా రెడ్ మార్క్ పెట్టిస్తారని భయంగా ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవినీతిపై గొప్యంగా విచారణ చేస్తే ఎవరెవరు ఎంతెంత డబ్బులు తీసుకున్నారనేది కచ్చితంగా బయటికి వస్తుందని రైతన్నలు అంటున్నారు. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, భూ రీ సర్వేలో జరుగుతున్న అవినీతిపై విచారణకు ఆదేశించి, రైతులకు న్యాయం చేసిన వారవుతారని మండల ప్రజలు కోరుతున్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 15, డిసెంబరు 2025

ఐఎంఏ సహకారంతో ఉచిత వైద్య సేవలు హర్షణీయం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఐఎంఎ సహకారంతో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు హర్షణీయమని మంత్రి ఫరూక్ అన్నారు. నంద్యాల పట్టణం ఫరూక్ నగర్ వద్ద ఆదివారం ఐఎంఎ, నంద్యాల, శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని, పేద ప్రజలకు ఇటువంటి వైద్య సేవలు అందించడం ఎంతో ముదావహమన్నారు. అలాగే నంద్యాల పట్టణంలో పేదల కాలనీలలో ఐఎంఎ వారు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని మంత్రి ఫరూక్ సూచించారు. ఐఎంఎ, నంద్యాల కార్యదర్శి, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మొహమ్మద్ రఫీ, డాక్టర్ మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ మంత్రి ఫరూక్ సహకారం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, ప్రజల ఆరోగ్యంపై ఆయన చూపిస్తున్న ఆసక్తి, సేవాభావం ఈ కార్యక్రమ విజయానికి మరింత బలం చేకూర్చిందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఐఎంఎ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు, కర్నూల్ డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ ఆరిఫా భాను,శాంతిరాం సూపర్ స్పెషాలిటీ వైద్యులు పవన్ కుమార్ రెడ్డి, రాజేష్ రెడ్డి, ఆర్షియా సుల్తానా, జాకీర్ హుస్సేన్, ఫణీంద్ర, వసీం హాసన్ రాజా, సర్జన్, ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా సుమారు వెయ్యి మందికి పైగా వివిధ వైద్య విభాగాలకు చెందిన ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు.

దత్తత తీసుకున్న గ్రామాన్ని అభివృద్ధి చేసి తీరుతా

విశాలాంధ్ర - ఆదోని రూరల్: దత్తత తీసుకున్న సుల్తానాపురం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం దత్తత తీసుకున్న సుల్తానాపురం గ్రామంలో ఆమె పర్యటిస్తూ సిసి రోడ్లు,డ్రైనేజీ తదితర మౌలిక వసతులను పర్యవేక్షించారు. గ్రామంలో కనీస వసతులు కల్పించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైందన్నారు. పాలకులు మారిన ప్రజల సమస్యలు మాత్రం పరిష్కరించే దిశలో అడుగులు వేసిన దాఖలాలు ఎప్పుడు చూడలేదని గ్రామ ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. గత వైసిపి మాదిరిగా మాటల పాలన కాదని, అభివృద్ధి చేసి చూపించేందుకు పని పాలన ప్రారంభమైంది అన్నారు. అభివృద్ధి కుంటుపడిన సుల్తానాపురం గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో అభివృద్ధి మోడల్ గ్రామంగా మార్చడమే తన బాధ్యతగా తీసుకున్నానని గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు. వర్షాకాలంలో మురుగునీరు విధుల్లోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని గమనించి డ్రైనేజీ పనులను ప్రాధాన్యతగా చేపట్టామని తెలియజేశారు. మట్టి రోడ్ల కారణంగా ఎదురవుతున్న రాకపోకల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని ఆమె వెల్లడించారు. గ్రామ అభివృద్ధి కాగితాలకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి పనులు చేయడమే తన రాజకీయ విధానంగా మలుచుకోవడం జరిగిందన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజల పక్షాన ఉంటూ ప్రజల కోసం పోరాటాలు చేసే సైనికురాలుగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు తమ గ్రామంలోకి నాయకులు వచ్చారు మాటలు చెప్పారు వెళ్లారని, ఇప్పుడు స్వయాన దత్తత తీసుకున్న నాయకురాలు తమ గ్రామంలో పనులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, లక్ష్మీనారాయణ, నాగరాజు, భాస్కర్,చంద్ర,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హిందూ దర్మం, సంస్కృతి ఆత్మ లాంటివి

విశాలాంధ్ర - వెలుగోడు : భారత దేశానికీ హిందూ ధర్మం, సంస్కృతి ఆత్మ లాంటివని, ఈ లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ 1925 నుంచి పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వెలుగోడు పట్టణంలోని ఏబివిపి కార్యాలయం వద్ద మైదానంలో హిందూ సమ్మేళనం జరిగింది. శారద పీఠం పిఠాధిపతులు శివ యోగేంద్ర సరస్వతి స్వామి, వాసవి కన్యకా పరమేశ్వరి ఆల్ ఆర్ట్స్ డెవలప్మెంట్ సోసైటీ అధ్యక్షులు అపర్ణ దీపిక మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ, దేవాలయ వ్యవస్థ, సామాజిక సమరసత తో మనమంతా హిందువులం బంధువులం అనే ఆత్మ విశ్వాసాన్ని నిర్మాణం చేయడమే హిందూ సమ్మేళనం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సందర్భంగా భజన కీర్తనలు, కోలాటం మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఈ కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత భయ్యా శ్రీనివాస్ మరియు హిందూ పరిషత్ కార్యదర్శి రాఘవ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు లాలం సుధాకర్, బిజివైఎం నాయకులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

మినరల్ వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ చేసిన బైరెడ్డి

విశాలాంధ్ర - నంది కొట్కూరు: నియోజకవర్గ పరిధిలోని పగిద్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం టీడీపీ సీని యర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సంద ర్భంగా బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ.5 లక్షలతో గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించి గ్రామ ప్రజలు తాగేందుకు శుద్ధి చేసిన మంచి నీరు అందిస్తామన్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజలు చాలా ఇబ్బంది పడడం జరిగిందని ప్రస్తుతం చంద్ర బాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు పోవడం జరుగుతుందన్నారు. నియోజవర్గంలో ఎంపీ శబరమ్మ సహకారంతో అభివృద్ధికి బాటలు వేసేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ సుజాత, టీడీపీ నాయకులు సురేష్ రెడ్డి, శరత్ గౌడ్, బలరాం, జయరామిరెడ్డి, బసవ గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లా చేస్తే బాబు సొత్తు ఏమైనా పోతుందా..

విశాలాంధ్ర - ఆదోని రూరల్: కర్నూలు జిల్లాకే ఆర్థికంగా ఖజానాను అందిస్తున్న ఆదోని డివిజన్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా చేస్తే ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సొత్తు ఏమైనా పోతుందా, ప్రజల సొమ్ముతోనే కదా జిల్లా ఏర్పాటు చేసేది అంటూ పిఓడబ్ల్యు స్త్రీ విముక్తి మహిళా నాయకురాలు సుజ్ఞానమ్మ ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహ వ్యక్తం చేశారు. ఆదివారం 29వ రోజు ఏపీఎన్జీపిసి నాయకురాలైన ఉషారాణి, పిఓడబ్ల్యు స్త్రీ విముక్తి మహిళా నాయకురాలు సుజ్ఞానమ్మ నాయకత్వంలో 15 మంది మహిళలు రిలే నిరాహార దీక్షలలో కూర్చున్నారు. ఎన్జిఓఎస్ నాయకురాలు ఉషారాణి రూ.5వేలు ఉద్యమానికి విరాళం ఇచ్చారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి జేఏసీ నాయకులు ఎస్.రఘురామయ్య,అశోక్, ఆనంద్ రెడ్డి, టి.వీరేష్, పగడాల కోదండ, దస్తగిరి నాయుడు, ఎం.రామ లింగయ్య, కృష్ణమూర్తి గౌడ్, భారత్, అసోసియేషన్ నాయకులు అడ్వకేట్ నాగేంద్రయ్య మాట్లాడుతూ దీక్షకు వివిధ ప్రజాసంఘాల మహిళా నాయకులు, కార్మిక మహిళలు, ఉద్యోగినులు, గృహిణులు హాజరై ఐక్యతను చాటుతు న్నారన్నారు. ప్రాంత అభివృద్ధిలో ఆదోని తీవ్రంగా వెను కబడి ఉందని, జిల్లా ప్రకటించడమే దీనికి శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. పరిపాలనా సౌలభ్యం జిల్లా కేంద్రంగా మారితే ప్రభుత్వ కార్యాలయాలు సమీపంలో ఏర్పడి ప్రజలకు సేవలు వేగంగా అందుతాయన్నారు. జిల్లా కార్యాలయాలు, అనుబంధ శాఖల ద్వారా యువతకు ఉద్యోగాల అవకాశాలు పెరుగుతాయన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు, హాస్టళ్లు ఏర్పాటు కావడానికి అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా స్థాయి ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందు బాటులోకి వస్తాయ న్నారు. మహిళా అభివృద్ధి శాఖలు, రక్షణ కేంద్రాలు, స్వయం ఉపాధి పథకాలు విస్తరిస్తాయన్నారు. రోడ్లు,రవాణా,తాగునీరు, డ్రైనేజీ,గృహ నిర్మాణం వంటి సదుపాయాలు మెరుగుపడతాయన్నారు. చిన్న,మధ్య తరహా పరిశ్రమలు ఏర్పడి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. 29 రోజులుగా శాంతియుతంగా కొనసాగుతున్న ఈ దీక్షలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని మహిళలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆలూరులో వేడెక్కుతున్న జిల్లా ఉద్యమం

విశాలాంధ్ర -ఆలూరు: ఆలూరు మండల కేంద్రంలో ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకు న్నాయి. పాత బస్టాండ్ సమీపంలో కొనసాగుతున్న ఈ దీక్షలకు వివిధ సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతూ పాల్గొంటున్నాయి. మూడో రోజు ప్రత్యేకంగా కొక్కర చెడు, బేవినేహాల్, టీ.చాగిబండ గ్రామస్తులు స్వయంగా దీక్షలో కూర్చుని ఆదోని జిల్లాను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో జేఏసీ నాయకులు, కురువ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఆ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ వికాస భృతి పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల వాసి, ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ రాజేష్ ఆర్థిక సహాయంతో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ వికాస భృతిని పంపిణీ చేశారు. ఆదివారం నంద్యాలలోని కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి ఉస్మాన్ బాషా, సీనియర్ రిపోర్టర్, కార్యక్రమ సమన్వయకర్త నూర్ బాషాల ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ నిరుద్యోగ యువత చదువుకొని మూడేళ్లు నిరుద్యోగులుగా ఖాళీగా ఉండడంతో వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు నిరుద్యోగ వికాస భృతి కార్యక్రమం ద్వారా రూ.2 వేల ఆర్థిక సహాయం అందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని గోళ్ళ రాజేష్ చేపట్టినట్లు వారు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడి, మంచి ఉద్యోగం సంపాదించే వరకు తన వంతుగా ఇలాంటి సహకారం అందిస్తున్నట్లు గోళ్ళ రాజేష్ అన్నారు.

ఆళ్లగడ్డలో బలిజ సోదరుల ఆత్మీయ సమ్మేళనం చేపట్టిన నాయకులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలో బలిజ సోదరుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు నల్లగట్ల బాలుడు, మైలేరి మల్లయ్య, అర్జిగారి నరసింహులు పాల్గొని మాట్లాడారు. పుట్టగ శ్రీకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ వారి అభినవ కృష్ణదేవరాయ పవన్ కళ్యాణ్' బిరుదు ప్రదాన కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇది సేవకు, త్యాగానికి, ప్రజాప్రయోజన నాయకత్వానికి లభించిన మహా గుర్తింపు అని అన్నారు. ఆళ్ళగడ్డలో శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం దగ్గర అభినవ కృష్ణదేవరాయ బిరుదు ప్రదానం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. నియోజకవర్గ బలిజ నాయకులు కొల్లం పుల్లయ్య, ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, జిల్లా సుబ్బరాయుడు, గుత్తి నరసింహుడు, మైలేరి మల్లయ్య, ఏరువ కృష్ణమూర్తి, గుబగుండం ఆంజనేయులు, మద్దిలేటి, జింక వెంకట స్వామి, నీలి వెంకటేశ్వర్లు, దేవా ఆంజనేయులు, లక్ష్మీ నరసయ్య, కొండపేట వీరయ్య, రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, బావికాడికి గుర్రప్ప, మంగమ్మగారి ప్రసాద్, మైలారి శ్రీరాములు, మైలారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అహోబిలంలో కల్యాణ మండప కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ కళ్యాణ మండపం కొరకు సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ ఆధ్వర్యంలో నూతనంగా కాంపౌండ్ వాల్ పూజా కార్యక్రమం ఆదివారం చేపట్టారు. శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ కమిటీ సభ్యులు మాట్లా డుతూ శ్రీ కృష్ణ దేవరాయ కళ్యాణ మండప అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సంఘం తరపున కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసేటి నాగిరెడ్డి, గూడూరు సంజీవరాయుడు, మైలరి మల్లయ్య, కొట్కూరు తిరుపాలు, పత్తి సూర్యనారాయణ, యామా గురప్ప, కొల్లం పుల్లయ్య, కొండపేట వీరయ్య, పత్తి బ్రహ్మయ్య, రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, దూలం మెగా చైతన్య, బండి రామచంద్రుడు, డ్రైవర్ చిన్న నరసింహుడు, హరి కృష్ణ, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం విద్యకు అడ్డు కాకూడదు

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల యందు 1999 -2000 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా పూర్వ విద్యార్థులు బాణాసంచా కాల్చుతూ బాజా, భజంత్రీలతో పొట్టి శ్రీరాములు సెంటర్ నుండి పాఠశాల వరకు పాదయాత్ర చేశారు. వెలుగోడు జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల హెచ్ఎం సత్య నారాయణ విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బయ్య, రంగారెడ్డి, సత్యనారాయణ ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు. మక్బుల్ భాష ,ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి ,శివకుమార్, ఈశ్వరయ్య ,సుదర్శనం, మహమ్మద్ ఇక్బాల్, రాజు, రవి శంకర్ శర్మ ,రామకృష్ణ, నర్సింహులు మాట్లాడుతూ, ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్టు నీడలో అన్న సినీ గేయం ఈ విద్యార్థులకు సరిపోతుందన్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలతో కూడినటువంటి విద్యను అందించామన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పాఠాలు చెప్పిన గురువులను, చదువుకున్న పాఠశాలను, పుట్టిన ఊరుని ఎప్పటికీ మరువరాదు అన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదు అన్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి భారత దేశంలోని నలుమూలల నుండి తమ మిత్రబృందాన్ని కలుసుకోవడానికి పూర్వ విద్యార్థులు తరలి వచ్చారు.మిత్ర బృందం ఒకరినొకరు పరిచయం చేసుకొని ఆనందంగా కలుసుకొని చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగారు. మిత్ర బృందం తాము చదువుకున్న సమయంలో చేసిన అల్లర్లు ఉపాధ్యాయులచే తిన్న తిట్లు, దెబ్బలను గుర్తు చేసుకుంటూ ఆనంద లోకంలో మునిగిపోయారు. అనంతరం పాఠాలు నేర్పిన గురువులను దృశ్యాలువలు, పూలమాలలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. తదుపరి మిత్ర బృందానికి మెమొంటోలను పంపిణీ చేశారు.

ఆల్ మేవా వార్షిక సదస్సు, నూతన జిల్లా కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల పట్టణ నేషనల్ పిజి కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్ పాషా అధ్యక్షతన ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక సమావేశం, నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశం, జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల నుండి వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న మైనారిటీ ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఆల్ మేవా వ్యవస్థాపక అధ్యక్షులు ఇంజనీర్ సయ్యద్ హుస్సేన్, రాష్ట్రగౌరవాధ్యక్షులు ఎస్ఎండి అబులైస్, ప్రధాన కార్యదర్శి ఎస్.అంజద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండి సలీం, గౌరవ సలహాదారు రోషనలి, అబ్దుల్ సమద్, కర్నూలు ప్రధాన కార్యదర్శి ఎస్ఎండి రియాజ్ బాష, ఆత్మకూరు, శిరివెళ్ల అధ్యక్షులు మొహమ్మద్ ఆలం, రబ్బాని, జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరై మైనారిటీ ఉద్యోగుల సమస్యలు, శ్రేయస్సు గురించి చర్చించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ ఎన్నికలు జరిగి, కొత్త నాయకత్వం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా ఎస్ఎండి ఫరూక్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ గౌస్, కోశాధికారిగా గాజుల మహమ్మద్ కాశీం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షోయబుజ్జమా తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆల్ మేవా అసోసియేషన్ ప్రభుత్వానికి పలు డిమాండ్లను సమర్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 1.20 లక్షల మంది ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించాలనీ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు సమాన పనికి సమాన వేతనం నియమాన్ని దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ చేయాలని, వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఛానల్ కల్పించాలనీ, రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఇహెచ్ఎస్ సౌకర్యాన్ని కల్పిస్తూ, వారి వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, నంద్యాలలో ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద సద్భావన భవనం నిర్మించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు మోమిన్ సైఫుల్ల, నబి రసూల్, మహమ్మద్ రఫీ, షఫీ ఉల్లా, మీర్జా బేగ్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పూజలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరాజు దంపతులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన అహోబిలం చేరుకోగానే అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి సుస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఎగువ, దిగువ అహోబిలంలో కొలువు దిరిన శ్రీ జ్వాల నరసింహ స్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లను దిగువ అహోబిలంలో వెలిసిన ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వైస్ ఛాన్సలర్ దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి శాలువా కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ వెంకట బసవరాజు మాట్లాడుతూ పురాతన దేవాలయాలను కూటమి ప్రభుత్వం ఎంతో చొరవ తీసుకొని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

వృద్ధులకు ఉచితంగా స్వెటర్లు పంపిణీ

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: ప్రస్తుతం నగరంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వలన కర్నూలులో ఆదివారం రోజున సాయి గురు దత్త పాలిటెక్నిక్ అధినేత సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ వృద్ధులకు ఉచితంగా స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున వయసు పైబడిన వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈసంవత్సరం చలితీవ్రత ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వృద్ధులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకో వాలని, వృద్ధులను ఆదరించాల్సిన భాద్యత అందరిపైన ఉందని చెప్పారు. వృద్ధులను సంరక్షించే భాద్యత ప్రభుత్వంతో పాటు ధన వంతులు తమ బాధ్యతగా ఉండాలన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి వడ్డెరుల డిమాండ్లను తీసుకెళ్తా : ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: వడ్డెర కులస్థులంటే సీఎం చంద్రబాబుకు ఎంతో అభిమానమని, వడ్డెర కులస్థుల న్యాయమైన డిమాండ్లను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణం పాత సూరజ్ గ్రాండ్ హోటల్‌లో జిల్లా వడ్డెర సంఘ సమావేశానికి బైరెడ్డి రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వడ్డెరలు రాజకీయంగా, ఆర్థికంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, సమాజ అభివృద్ధిలో వడ్డెరల పాత్ర ఎంతో కీలకమన్నారు. యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని ప్రజలకు ఉపయోగపడే దిశగా ముందుకు సాగాలని సూచిం చారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మంత్రి ఫరూక్‌లు వడ్డెర కులస్థుల న్యాయమైన డిమాండ్, వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చే బాధ్యత తీసుకోవాలని, అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపేలా చూడాలని సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు వడ్డే చక్రధర్ మాట్లాడుతూ వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నంద్యాల పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆయన పేరుతో కమిటీ హాల్ నిర్మించాలని సూచించారు. సమావేశంలో వడ్డెర సంఘ నాయకులు శ్రీను, రామాంజనేయులు, జనార్ధన్, శ్రీరాములు, వెంకటసుబ్బయ్య, రామకృష్ణ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డిని గజ మాలతో ఘనంగా సన్మానం చేశారు.

దర్గాలో పాతేహాలు సమర్పించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: బనగానపల్లె పట్టణం పాతబస్టాండ్ ప్రాంతంలోని హజరత్ సయ్యద్ సిద్ధిఖి జలాల్ రహమతుల్లా అలైహీ, హజరత్ సయ్యద్ బదియుద్దీన్ షా ఖాద్రి రహమతుల్లా అలైహి, హజరత్ సయ్యద్ మీర్ హాషం అలి ఉర్సు దెహలివాలె సాహెబ్ దర్గాల నందు జరుగుతున్న గంధం మహోత్సవానికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొని పూల షేరా దట్టీ, ఫాతేహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలో ఉప సర్పంచ్ బురానుద్దీన్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, పీఏ మురళీమోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఉపాధ్యాయులకు టీ షర్టుల పంపిణీ

విశాలాంధ్ర - రుద్రవరం: త్రో బాల్ పోటీలకు ఎంపికైన మహిళా ఉపాధ్యా యులకు టీ షర్టులు పంపిణీ చేసినట్లు ఎంఈఓ వీరరాఘవయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రుద్రవరం మండలా లెవెల్ ఉపాధ్యాయుల త్రోబాల్ పోటీలలో పాల్గొని డివిజన్ లెవెల్ కు ఎంపికైన మహిళా ఉపాధ్యాయులకు టీ షర్టు పంపిణీ చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రుద్రవరం మండల మహిళ ఉపా ధ్యాయుని క్రీడాకారులు డివిజనల్ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకి ఎంపిక కావాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రుద్రవరం ప్రధానోపాధ్యాయులు, వెంకటరమణ పాల్గొని మహిళ ఉపాధ్యాయుని క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపిక కావాల న్నారు. ఈ కార్యక్రమంలో మండలం వ్యాయామ ఉపాధ్యా యులు ధర్మరాజు, దాస్, శ్రీనివాసులు, రజియా సుల్తానా ప్రసాద్, ఓబన్న పాల్గొన్నారు.

ఆదోని మండలంలోనే కొనసాగించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: తమ గ్రామాన్ని పెద్ద హరివనం మండలంలో కల్పవద్దని నారాయణ పురం గ్రామ సర్పంచ్ ఆలమ్మ గారి సరళమ్మ, ఎంపీటీసీ కరెప్ప, భీమలింగ పలువురు ప్రజలతో కలసి ఆదివారం టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయు డుకు వినతిపత్రం అందజేశారు. ఆదోని మండలానికి 8 కిలో మీటర్ల డిస్టెన్స్ మాత్రమే ఉందని, పెద్ద హరివనం మండల కేంద్రానికి దాదాపు 40 కిలోమీటర్ల మేర డిస్టెన్స్ ఉందని గుర్తు చేశారు. పెద్ద హరివరం మండల కేంద్రానికి వెళ్లాలంటే అవసరాల నిమిత్తం ఒక్క రోజుతో ప్రయాణం అయ్యే పని కాదని ప్రజలు చాలా కష్టమైన ఇబ్బం దులు ఎదుర్కోవాల్సి వస్తుందని విజ్ఞప్తి చేశారు. ఆదోని మండలంలో కొనసాగించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గ్రామ ప్రజల న్యాయమైన కోరిక పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా జరగాలి

విశాలాంధ్ర-గూడూరు: ఇంటిటా చెత్త సేకరణ పక్కగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఎం మధు పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో సర్పంచ్ గొల్ల వెంకటేశ్వరమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మధు ఆదేశాల మేరకు ఇంటింటా చేత సేకరణ చేపట్టి చెత్త సేకరణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మధు మాట్లాడుతూ గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.